అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
గురువారం 16 మార్చి 2023

శ్రద్ధతో చదివి లక్ష్యం సాధించాలి



- జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-నిజాంసాగర్

విద్యార్థులు శ్రద్ధతో చదివి లక్ష్యం సాధించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.బుదవారం ఆయన మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.మోడల్ స్కూల్, కేజీబీవి, గురుకుల కళాశాల విద్యార్థులు పరీక్షలలో మంచి మార్కులు సాధించి ఉన్నతంగా ఎదగాలని కోరారు. మాస్ కాపియింగ్‌కు పాల్పడకుండా మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు.

బోధన్ రూరల్ స్టేషన్ తనిఖీ చేసిన సీపీ



నవతెలంగాణ-బోధన్

సీపీ కేఆర్ నాగరాజ్ బుధవారం బోధన్ రూరల్ పోలీసు స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ లో నేరాల నమోదు, స్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసు సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని, కేసుల పరిష్కారం ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలని సీపీ పోలీసులను సూచించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి సిబ్బంది విధుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏసీపీ కిరణ్ కుమార్, రుద్రూర్ సీఐ జాన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ సందీప్ ఉన్నారు.



నాగమడుగుతో 40 వేల ఎకరాలు సస్యశ్యామలం

- అభివృద్ధికి పరితపించే వ్యక్తి హన్మంత్‌షిండే
- భారీ మెజార్టీతో మరోసారి గెలిపించుకోవాలి
- బహిరంగ సభలో ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- నాగమడుగు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- పిట్లం, బిచ్కుంద మున్సిపాల్టీగా ఏర్పాటుకు హామీ





నిజాంసాగర్ మండలంలో నాగమడుగు ఎత్తిపోతల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్, ప్రజాప్రతినిధులు.. పిట్లంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్..



సభకు హాజరైన జనం

నవతెలంగాణ-నిజాంసాగర్/పిట్లం

నాగమడుగు ఎత్తిపోతల ప్రాజెక్టుతో జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద మండలాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రైతుల కల సాకారం చేసేందుకు జుక్కల ఎమ్మెల్యే హన్మంత్ షిండే కోరిన వెంటనే సీఎం కేసీఆర్ రూ.476 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం జక్కాపూర్, మల్లూరు శివారులో నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులకు బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే షిండేతో కలిసి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. నాగమడుగు ప్రాజెక్టు ఈ ప్రాంత పంటలు సస్యశామలం కానున్నాయని అన్నారు. కాగా ఈ పథకం కోసం ఇప్పటికే అధికారులు భూ సేకరణ చేపట్టగా ఒక్కో ఎకరానికి రూ.17 లక్షల చొప్పున నష్టపరిహారం అందించనున్నారు.

రూ.25 కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభం

మండల కేంద్రంలో నిజాంసాగర్ వరద కలువపై గల పెద్ద పుల్ వంతెన శిథిల వస్థలు చేరుకుని కూలిపోవడతో నూతనంగా రూ.25 కోట్లతో నిర్మించిన పెద్ద పుల్ వంతెన రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నిజాం ప్రభుత్వం నిజాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మించిన హయాంలో నిర్మించిన పెద్ద పుల్ వంతెన శిథిలావస్థకు చేరగా.. ముందు చూపుతో నిధులు మంజూరు చేసి సకాలంలో వంతెన పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. కాగా గత వర్షాకాలంలోనే పాత వంతెన కూలిపోగా.. ప్రస్తుతం కొత్త వంతెన అందుబాటులోకి రావడంతో ప్రయాణికులకు ఆటంకం లేకుండా మారినట్టు తెలిపారు.

ఈ వంతెన నిర్మాణంతో పిట్లం, నారాయణ ఖేడ్, సంగారెడ్డి, జహిరబాద్ దూర ప్రాంత ప్రజలకు సౌకర్యంగా మారింది. ఈ వంతెన ప్రారంభించ డంతో ప్రయాణికులు, వాహన దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి బిబి పాటిల్, జిల్లా జడ్పీ ఛైర్పర్సన్ ధఫెదర్ శోభ రాజు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఎంపిపి జ్యోతి దుర్గారెడ్డి, వైస్ ఎంపిపి మనోహర్, సర్పంచులు సంధ్యారాణి, కంశవ్వ, అంబావ్వ, జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఆర్డీవో రాజేశ్వర్, తహశీల్దార్ సత్యనారాయణ, ఈఈ సాల్మోన్ మండల నాయకులు గంగారెడ్డి, విఠల్, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం పరితపించే వ్యక్తి హన్మంత్‌షిండే : కేటీఆర్

పిట్లం : పిట్లంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండి హైదరాబాద్‌కు ఆడపాదడపా వస్తారని, కానీ వచ్చిన ప్రతిసారి తన నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు అడుగుతారని, కానీ ఏనాడూ తన వ్యక్తిగత పనుల గురించి అడగబోరని అన్నారు. ఇలాంటి ప్రజాప్రతినిధి ఉన్నందుకు జుక్కల్ ప్రజలు అదృష్టవంతులని కేటీఆర్ అన్నారు. ఈ సంవత్సరం జరిగే ఎన్నికల్లోనూ 72 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జుక్కల్ నియోజకవర్గంలో రూ.480 కోట్లు రైతుబంధు కింద అందజేశామని తెలిపారు. అలాగే ఈ నియోజకవర్గంలో 35,750 మందికి పెన్షన్లు అందచేస్తున్నామని తెలిపారు. 13 వందల దళిత కుటుంబాలకు పది లక్షల చొప్పున అందజేసినట్టు తెలిపారు. తెలంగాణ ఉద్యమమే నీళ్ల, నిధులు, నియమకాల కోసం జరిగిందని, కాళేశ్వరం నిర్మించి నిజాంసాగర్ స్థిరికరించామని, తాజాగా నాగమడుగుతో మరో 40 వేల ఎకరాలకు నీళ్లు అందనున్నాయని తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే అడిగినట్టుగా 11 తండాలకు రోడ్డు నిర్మించేందుకు నిధులు విడుదల చేసే బాధ్యత తనదని కేటీఆర్ అన్నారు. బిచ్కుంద, పిట్లం మండలాలను మున్సిపాల్టీలుగా చేస్తామని హామీనిచ్చారు. అలాగే జుక్కల్-మద్నూర్ మధ్య బ్రిడ్జి నిర్మిస్తామని తెలిపారు. వీటితో పాటు మండలంలో పలు రోడ్లను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, జడ్పీ చైర్మన్ దఫేదర్ శోభ, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ , నిజామాబాద్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు గణేష్ గుప్తా , సురేందర్ , కలెక్టర్ జితేశ్ వి పాటిల్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజుబుద్దిన్ , జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, డిసిసిబి చైర్మన్ భాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కవిత విజయ్, సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పిట్లం, బిచ్కుందను మున్సిపాల్టీలు చేయండి

కేటీఆర్‌ను కోరిన ఎమ్మెల్యే షిండే



పిట్లం : వెనుకబడిన మారుమూల జుక్కల్ నియోజకవర్గంలో ఏ ఒక్క మునిసిపాలిటీ లేనందున పిట్లం - బిచ్కుంద మండలాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మంత్రి కేటీఆర్‌ను కోరారు.బహిరంగ సభలో పలు వినతులను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్ నాయకత్వంలో 8 సంవత్సరాలలో రూ.540 కోట్లతో ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ రోడ్లు వేయించుకున్నామన్నారు. నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ 470 కోట్లతో పనులు ప్రారంభించుకున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో 5 వేల ఇండ్లను సీఎం మంజూరు ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో నాలుగు 132 కె.వి సబ్ స్టేషన్ లకు మంజూరు ఇవ్వడంతో పనులు కొనసాగుతున్నాయని అన్నారు. తెలంగాణ సాధించుకున్న తరువాత మారుమూల గ్రామాల్లో సైతం రోడ్లు వేశామని, మరో 11 తండాలలో బీటీ రోడ్లు , 8 పంచాయతీ రాజ్ లింకు రోడ్లు కావాలన్నారు. నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ గుండా వడ్డేపల్లి , మల్లూర్ , అన్నారం గేట్ వరకు 10 కిలోమీటర్ల సింగిల్ రోడ్డను 20 కోట్లతో డబుల్ రోడ్డు గా మార్చాలన్నారు. మద్నూర్ మండల సలాబత్‌పూర్ హనుమాన్ టెంపుల్‌కు 6 కోట్ల 70 లక్షలతో పనులు కొనసాగుతున్నాయని అదనముగా మరో రెండున్నర కోట్లు ఇవ్వాలని , పిట్లం , జూకల్ మండల లోని పురాతనమైన రామలింగేశ్వర ఆలయము , కౌలాస్ కోటలకు తల రెండున్నర కోట్లు మంజూరు చేయాలన్నారు. నిజాంసాగర్ - పెద్ద కొడప్గల్ మండలాలలో జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలని , పిట్లం-బిచ్కుంద మండలాలలో 50 లక్షలతో షాది ఖానాలు మంజూరు చేయాలని అన్నారు. పిట్లం-జూకల్ మండలాలలో బంజారా భవనములు మంజూరి చేయాలన్నారు. లెండి ప్రాజెక్టు నిమిత్తం 250 కోట్లు ప్రతిపాదించాలన్నారు. నియోజకవర్గంలో ఏడు మండలాలతో పాటు మరో నూతన మండలంగా మహమ్మద్‌నగర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఐటీరంగంలో ఐదున్నర లక్షల ఉద్యోగాలు



పిట్లం : రాష్ట్ర ఐటీ రంగంలో ఐదున్నర లక్షల ఉద్యోగాలు సాధించామని రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బహిరంగ సభలో మాట్లాడారు. 2014 రాష్ట్రంలో ఐటీ ఎగుమతుల విలువ రూ.57 వేల కోట్లు ఉంటే 8 సంవత్సరాల కాలంలో రూ.లక్ష 83 వేలకు పెరిగిందన్నారు. ఐటీ రంగంలో మూడు లక్షల ఉద్యోగాలు ఉంటే తమ ప్రభుత్వములో ఐదున్నర లక్షల ఐటీ ఉద్యోగాలు కేటీఆర్ కషి వల్ల పెరిగాయన్నారు. కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, పేదలకు , వత్తులకు ఏం కావాలో అన్ని తెలుసుకుని ఇస్తూ పోతుంటే మరోపక్క ఐటీ శాఖ మంత్రి రాష్ట్రంలో ఎనిమిది సంవత్సరాల కాలంలో అనేక పరిశ్రమలు నెలకొల్పి యువతకు, రాష్ట్ర అభివద్ధికి నిరంతరం కషి చేస్తున్నారని ఆయన కొనియాడారు.

కంటి వెలుగు సిబ్బందికి సన్మానం



వైద్య, ఆరోగ్య సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-ఏర్గట్ల

తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో ప్రజలకు వైద్యం అందించిన కంటివెలుగు డాక్టర్లను, సిబ్బందిని గ్రామపంచాయతీ తరపున సర్పంచ్ మంజుల బాలాజీ గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుర్మ శేఖర్,మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ,హెల్త్ అసిస్టెంట్ పండరీ, సూపర్ వైజర్ మారుతి, ఏఎన్ఎంలు, ఆశాలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులతో

- ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-నవీపేట్

అదనపు కట్నం వేధింపులు భరించలేక ఉరేసుకొని వివాహిత ఆత్మ హత్య చేసుకున్న ఘటన మండలంలోని శివతండా లో బుధవారం చోటుచే సుకుంది. ఎస్ఐ రాజారెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేవతి అలియాస్ శిరీష(30), మోహన్‌కు 2008లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త మోహన్ ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. కాగా కొన్ని రోజులుగా అత్తమామలు తరచూ వరకట్నం కోసం వేధించడం ప్రారంభించారు. దీంతో పాటు భర్త సైతం ఫోన్‌లో దూషిస్తూ ఉండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకిని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి రాథోడ్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

కడుపునొప్పి తాళలేక యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని వినాయక్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం చోటుచేసుకుంది. నాలుగోటౌన్ ఎస్ఐ సందీప్ వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌కు చెందిన అనిష్(31) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స పొందినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన 14వ తేదీనా రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

డబుల్ ఇంజన్ ట్రబుల్‌లో పడింది

- అదానీ అవకతవకలపై జేపీసీ వేసి మోడీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
- బీఆర్ఎస్- బందిపోట్ల రాక్షస సమితి
- పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

డబుల్ ఇంజన్ అంటే ఆదానీ, మోడి అని, డబుల్ ఇంజన్ ఇప్పుడు ట్రబుల్ ఇంజన్ అయిందని అదానీ ఇప్పుడు ట్రబుల్‌లో ఉన్నాడని పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. హాతే సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా నిజామాబాద్ క్యాంప్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుజరాత్ నుంచి నలుగురు దొంగలు వచ్చారని ఇద్దరు అమ్మేవాళ్లు ఇద్దరు కొనేవాళ్లు అని ఎద్దేవ చేశారు. అదానీ పై హిడెన్ బర్గ్ సంస్థ పరిశోధక కథనం ప్రచురించి అదాని డొల్లతనం బట్టబయలు చేసినట్టు చెప్పారు. అదానీ షేర్‌ల విలువ విపరీతంగా పెంచి షేర్ మార్కెట్‌ను పథకం ప్రకారం పతనం చేశారన్నారు. ప్రపంచ ధనవంతుల్లో 69వ స్థానంలో ఉన్న అదానీ 2021 నాటికి ప్రపంచంలో 3వ స్థానంలో ఉన్నారన్నారు. మోడి ప్రధాని కాకముందు అదానీ ఆస్తులు 6 వేల కోట్లు అనీ మోడి ప్రధాని అయ్యాక 11 లక్షల 30 వేల కోట్లు ఆస్తులు పెరిగాయన్నారు. ఎల్ ఐసి, ఎస్ బిఐ సంస్థల నుంచి తనాఖా పెట్టి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నారన్నారు. నిజామాబాద్ జిల్లాకు శ్రీ రాంసాగర్, పోచంపాడ్, మెడికల్ కాలేజి, జనరల్ హాస్పిటల్, తెలంగాణ యూనివర్సిటీలను కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంజూరు అయ్యాయ న్నారు. యూపీఏ హయంలో వచ్చిన అవినీతి, ఆరోపణలు కుంభకోణాలపై ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని 2 జి కుంభ కోణం, బొగ్గు గనుల లీజు వ్యవహారం, కామన్ వెల్త్ గేమ్స్ నిర్వహణ పై జేపీసీ వేషామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హిడేన్ బర్గ్ పరిశోధన సంస్థ తేటతెల్లం చేసినా అదానీ సంబంధించిన షేర్ పతనంపై జేపీసీ వేసి మోడి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లపై కాంగ్రెస్ పార్టీ రూపొందించిన తోడు దొంగలు అనే చార్జీషీట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బందీపోట్ల రాక్షస సమితిగా బీఆర్ఎస్‌ను, భ్రష్ట జూమ్ల పార్టీగా బీజేపీని వర్ణిస్తూ చార్జీషీట్‌లో ఉన్న అంశాలను వెల్లడించారు.



యాత్రలో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

కామారెడ్డి జిల్లా పర్యటనలో మంత్రి కేటీఆర్ తనపై చేసిన వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కేసీఆర్ మూడు వేల వైన్స్ లు , 33 వేల బెల్టు షాప్ లు పెట్టి అభివృద్ధి చేశారన్నారు. కవితపై ఈడి విచారణ సరైందేనన్నారు. కరోనా సమయంలో ఏఐసిసి అధ్యక్షురాలు సోనియా గాంధీపై ఈడి విచారణ చేపట్టిందని అన్నారు. అప్పుడు ముఖ్య మంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు స్పందించలేద న్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, గడుగు గంగాధర్, తాహెర్ బిన్ హందాన్, నగర అధ్యక్షులు కేశ వేణు, రూరల్ ఇంచార్జ్ భూపతి రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 1009 మంది గైర్హాజరు

- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, డీఐఈవో, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమైయ్యాయి. ఇంటర్ ఫస్టఇయర్‌లో తొలిపరీక్షకు 1009 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఐఈవో రాఘురాజ్ తెలిపారు. తొలి రోజు పరీక్షలు ప్రాశంతంగా ముగిసాయి. నిమిషం నిబంధన అమలు చేయడంతో ఎక్కువ మంది విద్యార్థులు సమయం కంటే ముందే చేరుకున్నారు. కాగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇక్కట్లు ఎదురవగా.. ఉరుకులు పరుగుల మీద కేంద్రానికి చేరుకున్నారు. మొదటి సంవత్సర విద్యార్థులు 19,956 మందికి గాను 18,947 మంది విద్యార్థులు హాజరవ్వడంతో 94.5 హాజరు శాతం నమోదు అయింది. మొదటి రోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి నిజామాబాద్ పట్టణంలోని నాలుగవ టౌన్ లో ప్రశ్నాపత్రాల పంపిణీ కేంద్రానికి ఉదయం ఎనిమిది గంటలకు ఆకస్మికంగా వెళ్లి అక్కడ కస్టోడియన్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు కళాశాలల్లో ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్ చిన్నయ్యలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీలను, హైపవర్ కమిటీ రాజీయుదిన్ ఆధ్వర్యంలో ఐదు పరీక్ష కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 19 పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 8 పరీక్ష కేంద్రం తనిఖీ చేసి సమీక్షించారు. ఎక్కడ కాపి జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారని అన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్, డీఐఈవో

నగరంలోని విశ్వశాంతి జూనియర్ కాలేజీ, కంఠేశ్వర్ ఉమెన్స్ కాలేజీలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మోడీ నటనకు ఆస్కార్ వస్తుండే..

- ప్రజల ఖాతాలో నగదుని.. దోస్తు ఖాతాలో నింపుతుండు
- తెల్లధనం అడిగితే నల్లమొఖం వేస్తుండు
- మోడీవి 'బాత్ కరోడోమె.. కామ్ పకోడోమే'
- దోస్తుతో కలిసి దేశాన్ని దోస్తుండు..
- మోడీ, ఈడీలకు భయపడబోం
- ఏం పీక్కుంటారో పీక్కోండి
- ప్రధాని తెలంగాణకు పట్టిన శని, దరిద్రం
- పిట్లం సభలో మోడీపై విరుచుకుపడ్డ కేటీఆర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న కేటీఆర్

గల్లీలో ఎంఐఎం.. ఢిల్లీలో బీజేపీ ఇదే కేసీఆర్ దోస్తానా

- కారు మీద కోపంతో బీజేపీకి ఓటువేయొద్దు
- ధర్మపురి కాదు అధర్మపురి
- నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయండి
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ గడ్డపై ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని ప్రజలకు పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కెసిఆర్ మీద కోపంతో బిజెపికి ఓటు వేస్తే మన బతుకులు మరింత ఆగమైతా యని అన్నారు. ఎంఐఎం అధ్యక్షుడి మాట విని ముస్లింలు కారుకు ఓటు వేస్తే ఆ ఓట్లతో గెలిచిన కేసీఆర్ గల్లీలో ఎంఐఎంతో ఢిల్లీలో బిజెపితో దోస్తానా చేస్తున్నారని విమర్శించారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి అటకెక్కించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి యాత్ర బుధవారం దుబ్బ ప్రాంతం నుంచి ప్రారంభమైంది. రాత్రి నెహ్రూ పార్క్ వద్ద ముగిసింది.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఇందల్‌వాయి బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్‌వాయి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో జీవా వారి ఆధ్వర్యంలో నెలకొల్పిన చలివేంద్రాన్ని తిర్మన్ పల్లి ఎంపిటిసి చింతల దాస్ బస్టాండ్ కంట్రోలర్ దేవిదాస్ తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి చింతల దాస్ మాట్లాడుతూ ... ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారని, ఇప్పుడే ఎండలు మండుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హేడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, దోంతుల శ్రీనివాస్ గుప్తా స్థానికులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్మికుల పక్షాన ఉంటుంది : రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షన ఉంటుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రెవంత్ రెడ్డికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ కార్మికులకు ఎల్లవేళలా సహకారం అందిస్తూ ఉంటుందని, కార్మికులు లేకుంటే ఏ కార్యాలయంలోను పనులు ముందు కు సాగావని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏడ్ల నాగరాజు, పుదరి గంగాధర్, వేణు గోపాల్, పెంటా చారీ, జాక్రియ, కార్తిక్, మొహియుద్దీన్, శ్రీనివాస్, భూమేష్, అసిఫ్, నాంపల్లి, మోహన్, మీర.గంగాధర్, చందు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలపై చర్యలు తీసుకోవాలి

- టీఎస్‌పీఎస్‌సీ ఛైర్మెన్, కార్యదర్శిని తొలగించాలి
- ఎస్ఎస్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసనలు, దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నిజామాబాద్‌సిటీ

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని, భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవరించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మెన్, కార్యదర్శిని తొలగించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ లో నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి సాయి ప్రసాద్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ... గ్రూపు 1 పరీక్ష కూడా లీకైనట్లుగా వార్తలు వస్తున్నాయని అన్నారు. పేపర్ లీకేజీలతో లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహించిన బోర్డు ఛైర్మన్ బి. జనార్దన్ రెడ్డి, బోర్డు కార్యదర్శి పాత్రపైనా, సభ్యుల పాత్రపైనా సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కమిటీ సభ్యులు, చిత్రు , దినేష్ , నవీన్, రాకేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చలగాటమాడుతున్న టీఎస్పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, యూనివర్సిటీ అధ్యక్షులు సంతోష్ డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల వ్యవహారాన్ని నిరసిస్తూ తెలంగాణ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద బుధవారం టీఎస్పీఎస్సీ బోర్డు దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగలు రావటం లేదని అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్య లు చేసుకుంటే , పరీక్షా పేపర్లు లీక్ చేస్తూ చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు అక్షయ్ ,శివ సాయి, నరేష్, రామకృష్ణ, అంజలి, రవీందర్ శ్రీకాంత్, వినోద్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : నిరసన తెలుపుతున్న నాయకులు



నిజామాబాద్‌సిటీ: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్‌సిటీ : ఉద్యోగాలను అమ్ముకోవడానికేనా తెలంగాణ సాధించుకున్నదని పీడీఎస్‌యూ నాయకులు ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్‌సీ పోటీ పరీక్షల లీకేజీకి వ్యతిరేకంగా, ఉద్యోగ నియమకాల్లో జరిగిన అవినీతి మీద సిట్టింగ్ జడ్జీచే విచారణచేపట్టాలని బుధవారం నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ముందు రాష్ట్ర ప్రభుత్వం, టిఎస్పిఎస్సి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, నగర అధ్యక్షులు ఎస్కే అషర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగాలు అమ్ముకుంటూ ఈ ప్రభుత్వం తెలంగాణ నిరుద్యోగులను మోసం చేస్తుందని అన్నారు. ఇప్పటివరకు జరిగిన పరీక్షల మీద, పేపర్ లీకేజీ మీద హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపో టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో నరేష్, సుజిత్, ప్రవీణ్, రాము అక్రమ్, నీలకంఠ, రాజేష్ అరుణాచలం నిరుద్యోగ విద్యార్థులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పేపర్ లీకేజీ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి అధ్వర్యంలో బుధవారం ఎన్టిఆర్ చౌరస్తాలో టిఎస్పిఎస్సి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ ఈఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, అవినీతికి పాల్పడిన అధికారులను తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేసి బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని కోరారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా టిఎస్పిఎస్సితో ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడడంతో లక్షలాది మంది ఉద్యోగంకోసం ప్రిపేర్ అవుతున్నారని తెలిపారు. ఈసయమంలో పేపర్ లీకేజీ ఘటనలు చోటు చేసుకోవడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా కమిటీ సభ్యులు సుభోద్, దినేష్, నగర నాయకులు నవిన్, శిరీష, సుమేధ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించిన రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి ఆధ్వర్యంలో అర్గుల్ రాజారాం మెమోరియల్ హాత్ సే హాత్ జోడో ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపీ, కాంగ్రెస్‌నాయకులు ఆయనతో పాటు ఫుట్ బాల్ ఆడారు. అనంతరం రేవంత్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులు కాంగ్రెస్ నాయకులు కేరింతల మధ్య ఫుట్ బాల్ మ్యాచ్ ఆహ్లాదంగా సాగింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి వారిని ఉన్నత శిఖరాలను చేరే విధంగా కృషి చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులందరూ పరేడ్ ప్రాక్టీస్ చేయాలి

వైస్ ఛాన్సలర్ రవిందర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సెక్యూరిటీ గార్డులందరూ పరేడ్ ప్రాక్టీస్ చేయాలని, యూనివర్సిటీ భద్రత కొరకు సెక్యూరిటీ గార్డు లు చురుకైన పాత్ర పోషించాలని, వీరికి త్వరలోనే అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పించే ఏర్పాట్లు చేయిస్తానని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ ఆదేశించారు. బుదవారం యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ ఆదేశాల మేరకు తెలంగాణ యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వివేక్‌రాజ్, యూనివర్సిటీ సెక్యూరిటీ గార్డ్స్‌లతో పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ సెక్యూరిటీ గార్డుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వీసీ రవీందర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహించేవారు చురుకుగా ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచించారు. ఇకనుండి పరేడ్ ను ప్రతి వారం విధిగా నిర్వహించాలని తెలిపారు. ఆయనవెంట డైరెక్టర్, పీఆర్వో డాక్టర్ జమీల్ అహ్మద్ ఉన్నారు.

టీయూలో కాన్షిరాం జయంతి వేడుకలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ తెలంగాణ యూనివర్సిటీ అధ్వర్యంలో బుధవారం మాన్యవర్ కాన్షిరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఎ ఉపాధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ కాన్షిరాం చేసిన త్యాగాలను, అనుసరించిన పొలిటికల్ సిద్ధాంతాలను గుర్తించుకోవాలని పేర్కొన్నారు. కాన్షిరాం అంబేద్కర్ కుల నిర్మూలన అనే ఒకే ఒక్క పుస్తకాన్ని చదివి ప్రేరణ పొంది భారతదేశంలో ఒక గొప్ప పొలిటికల్ పార్టీని స్థాపించారన్నారు. ఎంత జనాభో అంత సంపద అనే నినాదంతో ముందుకెళ్లారన్నారు. అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారాన్ని, రుచి చూపించినటువంటి ఒక గొప్ప రాజనీతిజ్ఞుడు కాన్షిరాంఅని తెలిపారు.ఏనాడైతే అందరికీ సమాన అవకాశాలు, సమాన అధికారాలు అందుతాయో ఆరోజ దేశం అభివద్ధి చెందుతుందని అయిన వివరించారు.కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింగ్‌పల్లిలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్ పల్లి తిరుమల క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం సూర్యప్రభ,చంద్ర ప్రభ వాహనంపై వేంకటేశ్వర స్వామిని ఊరేగించారు. సాయంత్రం స్వామి వారి ఎదుర్కోలు కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన గాయకులు రెండు జట్లుగా ఏర్పడి కీర్తనలు పాడారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మాడ వీధుల్లో పాటలు పాడుతూ నత్యాలు చేశారు. కార్యక్రమంలో ఆచార్య గంగోత్రి రామానుజ స్వామి, దేవానాథ జీయరు స్వామి, ఆలయ ధర్మకర్తలు , నరసింహారెడ్డి, విజయసింహారెడ్డి, శిరీష్‌లి, రవియాదవ్ నర్సారెడ్డి నరాల సుధాకర్, ప్రసాద్, రాజేశ్వర్ ,రమేష్ ,సాయిలు భాస్కర్ మురళి ,చిన్నయ్య ,ప్రమోద్ ,గంగారెడ్డి, లక్ష్మి నరేష్, సురేష్, యజ్ఞాచార్యులు లక్ష్మణాచారి స్వామి ,సంపత్ కుమారాచార్యులు, స్వామి రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

హిందీ విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ జమీల్ అహ్మద్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ ఎండి జమీల్ అహ్మద్ నియమితుల య్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్.ఎండీ.జమీల్ అహ్మద్ మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు హిందీ భాష నైపుణ్యాలు పెంపొందిస్తానని తెలిపారు. ఈ బాధ్యత అప్పగించిన వీసీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధినులకు డాక్టర్ ఎండి. జమీల్ అహ్మద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

17న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 17 న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, టెలికాలర్ ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హత ఇంటర్, డిగ్రీ ఆపైన వయోపరిమితి 18 నుండి 30ఏండ్ల వరకు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులకు ఉద్యోగమేళాలో జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ జిల్లాలో పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరాలకు 6305743423, 9959456793, 9581768413 మొబైల్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 నుండి 4గంటల లోపల జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీ నగర్ నిజామాబాద్ లో బయో డేటా, ఆధార్ కార్డుపాసుపోర్టు సైజు ఫోటో అభ్యర్థుల యొక్క సర్టిఫికెట్స్ తీసుకొని రావాలని తెలిపారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

కమిషనర్‌కు ఐద్వా వినతి

నవతెలంగాణ కంఠేశ్వర్

ప్రేమ కోసం పోరాటం చేస్తున్న బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ కమిషనరేట్ కార్యాలయంలోని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కెఆర్ నాగరాజుకు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత మాట్లాడుతూ..తొమ్మిది ఏండ్లుగా గంగోత్రి, కమ్మరి నరేష్ ప్రేమించుకున్నారని తెలిపారు. కమ్మరి నరేష్ అనే గంగోత్రిని ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్లి చేసుకుంటానని వాడుకున్నాడని అన్నారు. ఇప్పుడు పెళ్లి చేసుకోనని అంటున్నాడని, పోలీసు యంత్రాంగం న్యాయం చేయాలని కోరారు. రెండు రోజుల నుండి ప్రియురాలు ప్రియుడి ఇంటి ముందట న్యాయం కోసం ధర్నా చేస్తుందన్నారు. వారిని మండల పోలీస్ అధికారులు నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కావున బాధితురాలికి రక్షణ కల్పించి ఆమెకు న్యాయం చేయాలని అన్నారు. అదే విధంగా బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఐద్వా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బెజుగం సుజాత, సహాయ కార్యదర్శి అనిత, డ్వాక్రా మహిళలు , గ్రామస్తులు ఉన్నారు.



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

వేంపల్లిలో గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవులు, గేదెలకు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ వైద్యులు గౌతమ్ రాజు అవులు, గేదెలకు గర్భకోశ వ్యాధి నివారణకు వ్యాక్సిన్లను వేశారు. అనంతరం పశువుల యజమానులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్క మల్లుబాయి, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, డాక్టర్లు సంతోష్, రాజశేఖర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు..

మా నాయకున్ని విమర్శించే స్థాయి మీకు లేదు :ఏఐబీఎస్ఎస్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

మచ్చ లేని మా నాయకుడు, అహర్నిశలు రూరల్ అభివృద్ధికి కృషిచేసే ప్రజల మనిషి రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ 40ఏండ్ల నుంచి మచ్చ లేని నాయకుడిగా సేవ చేస్తున్న నాయకుడని ఆయన్ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని ఏఐబిఎస్ఎస్ యువజన మండల అధ్యక్షుడు మహేందర్ అన్నారు. బుధవారం పందిమడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రూరల్ కాంగ్రెస్ ఇంచార్జి భూపతి రెడ్డి ఏరోజైనా గిరిజన తండాలకు వచ్చావా.. వచ్చి చూడు..రూరల్ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి కనిపిస్తుందిన అన్నారు. పోడు భూములు ఆన్లైన్ అయ్యాయని, తండాలను పంచాయతీలుగా తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడో ప్రకటించిందని తెలిపారు. నిత్యం వందలాది మంది సమస్యలు తీరుస్తూ ఉండే క్యాంపు కార్యాలయం, మోపాల్ కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గోవర్ధన్‌ను విమర్శిసే ఉపేక్షించేది లేదని హెచ్చరించాడు. సమావేశంలో గ్రామస్తులు దేవేందర్, సురేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

ఆర్‌పి ఎల్ఐ రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ తప్పకుండా చేయించుకోవాలని, రూరల్ పోస్టల్ ఇన్‌ఛార్జి విజయ్ కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తపాల శాఖలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇతర లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు సంవత్సరం ముగుస్తున్న తరుణంలో బోనస్ ప్రకటిస్తుందని, కానీ ఈ పోస్టల్ డిపార్ట్‌మెంట్లో ఇన్సూరెన్స్ చేయించుకున్న వారికి సంవత్సరం బోనస్ ముందస్తుగానే అందిస్తుందని తెలిపారు. డిగ్రీ ఆపైన విద్యార్హతలు ఉన్నవారికి పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఇంటర్ విద్యార్హత కలిగిన వారికి, అంతకన్నా తక్కువ ఉన్నవారికి రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని అన్నారు. వయస్సు ప్రాతిపదికన ఇన్సూరెన్స్ ఎంత చెల్లించాలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వివరిస్తారని తెలిపారు. ఈ ఇన్సూరెన్స్‌కు ఆధార్ కార్డు, పాన్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బ్రాంచ్ పోస్టుమాస్టర్లను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ములుగు లింగం, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

బాల్య వివాహాలు చేయడం చట్టవ్యతిరేకం

నవతెలంగాణ - ముప్కాల్

మండల కేంద్రంలో బుధవారం బాలల సంరక్షణ కమిటి సభ్యులు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా సీడీపీవో భార్గవి హాజరై ప్రసంగించారు. బాల్య వివాహాలు చేయడం చట్టవ్యతిరేకమని అన్నారు. పిల్లలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా 109 నంబరుకు కాల్ చేయాలని తెలిపారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, సిడీపీఓ భార్గవి, ఏసీడీపీవో జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, ఈవో విజయ్, బాలల సంరక్షణ అధికారి గణేష్, అంగన్వాడీ సూపర్ వైజర్ మాదవి, అంగన్ వాడి టీచర్లు, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న సీడీపీవో భార్గవి

నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై ఆరోపణలు అర్థరహితం
- బీఆర్ఎస్ మండలాధ్యక్షులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం లేక ఇతర పార్టీలో ఉన్న వ్యక్తికి పీసీసీ అధ్యక్షులుగా చేశారని, ఎమ్మెల్యేలను కొనుగోలు విషయంలో నిందితుడిగా జైలుక వెళ్లి వచ్చిన వచ్చిన వ్యక్తిని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షునిగా చేశారని అలాంటి వ్యక్తి ఆర్టీసీ ఛైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై అవాక్కులు చవాకులు చేయడం తగదని, నోరు అదుపులో ఉంచుకొని మాట్లాడాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి డిచ్‌పల్లి, ఇందల్‌వాయి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, చిలువెరి గంగాదాస్, ఉప సర్పంచ్ లు ఫోరం మండల అధ్యక్షులు రఘునాథన్ రాము అన్నారు. డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడానికి మంచిప్పలో 3.5 టీఎంసీల రిజర్వాయర్ పనులు చేస్తున్నప్పుడు అక్కడ ఉన్న ప్రజలను రెచ్చగొట్టి పనులు జరగకుండా అడ్డుపడి రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులో అవినీతి చేస్తున్నదని ఆరోపించడం సరైంది కాదన్నారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టులో గత కాంగ్రెస్ పార్టీ హయాంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సుదర్శన్ రెడ్డి ఎంత కమిషన్ తీసుకున్నారో ప్రజలకు తెలపాలని వారు సవాల్ విసిరారు. రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేసిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. మంగళవారం రోడ్ షోసందర్భంగా మాట్లాడినప్పుడు చర్చకు రావాలని సవాల్ చేసిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డికి దమ్ముంటే మాటకు కట్టుబడి ఉండి చర్చకు రావాలని అన్నారు. అసలు డాక్టర్ భూపతి రెడ్డి కాంగ్రెస్ నాయకుడా, బిజెపి నాయకుడా ప్రజలకు తెలపాలని, గత వారం విలేకరుల సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్ డాక్టర్ భూపతి రెడ్డి బిజెపిలో రావడానికి సిద్ధంగా ఉన్నాడని ప్రకటించిన దానిపై ముందుగా జవాబు ఇవ్వాలని సవాల్ చేశారు. సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, మోహన్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు దండుగుల సాయిలు, యూత్ అధ్యక్షుడు అమీర్ ఖాన్, సీనియర్ నాయకులు షేక్ షాదుల్లా, ఒడ్డం నర్సయ్య, మోహమ్మద్ యూసుఫ్, అంజయ్య ప్రధాన కార్యదర్శి హరికిషన్, సర్పంచ్ గోపు నడ్పన్న, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా, వాటిని పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలు, భూ సేకరణ, పైప్ లైన్‌ల ఏర్పాటు, క్షేత్ర స్థాయిలో సమస్యలు, ఇరిగేషన్ భూముల ఆక్రమణలు తదితర అంశాలపై పోలీస్, రెవెన్యూ, అటవీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ నేతృత్వంలో సమన్వయ సమావేశం జరిగింది. కాళేశ్వరం 20 , 21 వ ప్యాకేజీల పనుల పురోగతి పై కలెక్టర్ ఆరా తీశారు. సారంగపూర్ వద్ద ఆక్రమణల కారణంగా 20వ ప్యాకేజీ పనులు ముందుకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇరిగేషన్ సీఈ మధుసూదన్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా ఆర్మూర్, పెర్కిట్ తదితర ప్రాంతాల్లో కెనాల్ భూములు సైతం కబ్జాలకు గురయ్యాయని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయించాలని సూచించారు. ఆక్రమణల తొలగింపు, కబ్జాలు నిలువరించే చర్యలపై తక్షణమే దృష్టిని కేంద్రీకరించాలని, అవసరమైన చోట పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారం తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే పలుచోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని పక్కా నిర్మాణాలు జరుపుకున్నారని, ఇకపై అలాంటి వాటికి తావులేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న ప్రాంతాల్లో నివాసాలు ఏర్పర్చుకున్న వారికి ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో వసతి, సదుపాయాలు కల్పించి వారిని అక్కడికి తరలించేందుకు కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా పైప్ లైన్ నిర్మాణాలకు సంబంధించి రైతులకు నష్టం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు వేసుకున్న పంటలు చేతికందిన తరువాతనే, అన్నదాతలను సంప్రదించి పైప్లైన్ పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఆదివారం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
గురువారం 16 మార్చి 2023

కొలతల ప్రకారం పనిచేస్తే కూలి

● ఎంపీడీవో నరేష్

నవతెలంగాణ-జుక్కల్

కొలతల ప్రకారం పని చేస్తే కూలి వస్తుందని ఎంపీడీవో నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని సావర్‌గావ్ జీపీలో జాతీయ ఉపాధిహామీలో చేపడుతున్న పనులను ఎంపీడీవో సర్పంచ్ కిషన్‌తో కలిసి పరిశీలించారు. చేపడుతున్న పనుల వివరాలను, కూలీల సంఖ్యను, హాజరు శాతం తదితర విషయాలను జీపీ ఇంచార్జ్ సెక్రెటరీ సతీష్‌ను, మేట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎండతీవ్రత ఎక్కువైనందున పనులను ఉదయం తొందరగా ప్రారంభించాలని, పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మంజీరా ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం



నవతెలంగాణ-రామారెడ్డి

మంజీరా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రీ కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గురువిందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు పచ్చదనం పరిశుభ్రత అంశాన్ని ఎంచుకొని కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించారని అన్నారు. స్థానిక సర్పంచ్ దండబోయిన సంజీవ్, కళాశాల డైరెక్టర్ సురేష్ గౌడ్, నయీమ్ భాయ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఎల్లారెడ్డి

● ఎమ్మెల్యే జాజాల సురేందర్
● ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేతుల మీదుగా ఐదు పడకల డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి పట్టణాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తామని అన్నారు. డయాలసిస్ పేషెంట్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడగగానే ఎల్లారెడ్డికి డయాలసిస్ సెంటర్‌కు రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేసిన ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుకి ఎల్లారెడ్డి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణాన్ని 50 కోట్ల నిధులతో ఎంతోగానో అభివృద్ధి చేస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బస్ స్టాండ్, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని వివరించారు. ప్రజలందరూ ఒక్కసారి ఆలోచించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రమని అన్నారు. ప్రతి పక్షాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో ఎక్కడ కానీ కంటి వెలుగు, రైతు బంధు వంటి పథకాలు అమలు చేయటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, జడ్పీటీసీ ఉష గౌడ్, మండలాధ్యక్షుడు జలెంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అధిములం సతీష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

మహమ్మదాబాద్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్‌లో సర్పంచ్ సాయిలు కంటివెలుగు శిబిరాన్ని బుధువారం ప్రారంభించినట్టు జేపీఎస్ జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ.. ఉచిత కంటి వెలుగు శిబిరంలో గ్రామస్తులు ప్రతి ఒక్కరూ పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, సర్పంచ్, ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు జాదవ్ రాజు, రామన్న అంగన్‌వాడీ టీచర్, ఆశావర్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు బహుజన రాజ్యాధికార యోధుడు, మాన్యశ్రీ కాన్షీరాం 89వ జయంతి వేడుకలను బుధవారం ఎల్లారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు అట్యారి బబ్లూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టెంకి బాల్‌రాజు, జిల్లా ఇన్చార్జ్ గుల్లని సాయిలు, జోనల్ మహిళ కన్వీనర్ బి.వసంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి పట్టణ కమిటీ అధ్యక్షులు మర్లు సాయిబాబా, ఉపాధ్యాక్షులు కుసల కంటి సాయిలు, కామారెడ్డి అసెంబ్లీ కార్యదర్శి బట్ట రాజలింగం, రాజంపేట మండల అధ్యక్షులు భాను, ఎల్లారెడ్డి మండల ఉపాధ్యక్షులు చిరంజీవి, గౌతమ్, నాగరాజు, సాయిలు, రాజు, తాడ్వాయి మండల కార్యకర్తలు మహేష్, రవి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయండి

● సర్పంచ్ లలితా రాఘవేందర్

నవతెలంగాణ-రెంజల్

ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాలని సర్పంచ్ గౌరాజీ లలిత రాఘవేందర్ కోరారు. బుధవారం మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థుల జీవితాలకు పదవ తరగతి తొలి మెట్టని, విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉత్తమ ర్యాంకులను సాధించి అటు పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాస్, ఎంపీటీసీ గడ్డం స్వప్న, మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, ఉపాధ్యాయులు అబ్బయ్య, గులాం హైమద్, సురేష్, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు స్వాగతం




మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

పిట్లం మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు మద్నూర్ మండలం నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కాగా బుధవారం మేనూర్ గ్రామానికి చెందిన వై.గోవింద్ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్‌కు గోవిందు ఇటుక బట్టి వద్ద స్వాగతం పలికారు. అక్కడి నుంచి పిట్లంకు వై.గోవిందు ఆధ్వర్యంలో మేనూర్ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో జనాలు తరలివెళ్లారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తరలివెళ్లారు.

సిద్దిరామేశ్వర ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం



ఆలయాభివృద్ధికి విరాళం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్ర శివారులోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయంలో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి కామారెడ్డి పట్టణానికి చెందిన డాక్టర్ రమాకాంత్ కుటుంబ సభ్యులు బుధవారం రూ. లక్ష విరాళాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అందే మహేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయాభివృద్ధికి తన వంతుగా లక్ష రూపాయల విరాళాన్ని అందజేసిన డాక్టర్ రమాకాంత్ కుటుంబ సభ్యులను స్వామివారి ప్రతిమతో పాటు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిద్ధ గిరి శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేద్దాం

● మాజీ మంత్రి, తెలంగాణ పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి/రెంజల్/వర్ని

బోధన్ నియోజకవర్గంలో తెలంగాణ పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఆయన కార్యక్రమాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, తెలంగాణ పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాసరావు, నాయకులు గైని పోచయ్య, లింగం, పరాన్, మచ్చూరి గంగాధర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రెంజల్ : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హాత్‌సేహాత్ జోడో పాదయాత్ర బోధన్ నియోజకవర్గంలో పర్యటించనున్నందున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సుదర్శన్‌రెడ్డి కోరారు.



ఎడపల్లి : మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు మొబిన్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాములు, జిల్లా నాయకులు జావిద్ ఉద్దీన్, గంగాకృష్ణ, అంజయ్య, ఎమ్మెల్ రాజు, సోక్కుల సాయిలు, శంషాద్దీన్, సిద్ద సాయిలు పాల్గొన్నారు.

వర్ని : కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేపడుతున్న పాదయాత్రలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ గ్రౌండ్‌లో జరగబోయే సభకు వర్ని మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ఎత్తున బయలుదేరారు. ఈ సందర్భంగా ఎలమంచిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలో రాహుల్‌గాంధీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని, రాబో యే ఎన్నికలలో ప్రజలే స్వయంగా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టబోతున్నారని దీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి పాదయాత్రను ప్రతి గ్రామ స్థాయి నుంచి, మండల కేంద్రాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబా, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగాప్రసాద్, కృష్ణారెడ్డి, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులున్నారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు



ఎల్లారెడ్డి : పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కాగా పలు చోట్ల విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. అలాగే మాస్ కాపీయింగ్ జరగకుండా పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

భిక్కనూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 209 మంది విద్యార్థులకు గానూ 201 మంది పరీక్షలకు హాజరుకాగా, ఎనిమిది మంది విద్యార్థులు గైహాజరైనట్టు కళాశాల సిబ్బంది తెలిపారు.

కోటగిరి : కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలలో 237 మందికి 229 మంది హాజరైనట్టు, 8మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు సూపరింటెండెంట్ తెలిపారు.

దోమకొండ : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 443కు గానూ 423 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సంతోష్ పరిశీలించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి తెలిపారు.

జుక్కల్ : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 205 మందికి గానూ 183 మంది హజరు కాగా, 22 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద జుక్కల్ పోలీసులు భద్రతను పటిష్టపరిచారు.

కేటీఆర్ సభకు.. బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం మండల కేంద్రంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు పలు మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా బుధవారం తరలివెళ్లారు.

పెద్దకొడప్‌గల్ : మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి పార్టీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వచ్చిన కార్యకర్తలతో ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎంపీపీ ప్రజాప్రతినిధులతో కలిసి మండల వీధుల గుండా ర్యాలీగా వెళ్లి గాంధీ చౌక్ వద్దకు వచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావ్ పటేల్, స్థానిక సర్పంచ్ తిరుమలరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు విజయ్ దేశాయ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు రమేష్, వెంకట్రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : కేటీఆర్ సభకు జుక్కల్ మండల ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జుక్కల్, బస్వాపూర్, నాగల్‌గావ్, కేమ్రాజ్‌కల్లాలీ, మహమ్మదాబాద్, లొంగన్‌తో పాటు ఇతర గ్రామాల బీఆర్ఎస్ నాయకులు వాహనాలలో సర్పంచులు, గ్రామ, మండల స్థాయి నాయకులు బహిరంగ సభను విజయవంతం చేసేందుకు తరలివెళ్లారు.



పెద్దకొడప్‌గల్ : తరలివెళ్తున్న నాయకులు

సర్పంచ్ ఆధ్వర్యంలో 10 వాహనాలు తరలింపు..

మద్నూర్ : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు మద్నూర్, డోంగ్లి, ఇరు మండలాల నుంచి భారీ ఎత్తున వాహనాల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మద్నూర్ మండల కేంద్ర గ్రామ పంచాయతీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు ధరస్వార్ సురేష్ ఆధ్వర్యంలో 10 వాహనాల్లో భారీగా జనాలు తరలివెళ్లారు.

కేటీఆర్‌ను కలిసిన రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామకృష్ణ

నవతెలంగాణ-లింగంపేట్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్ అతిమముల రామకృష్ణ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నిజాంసాగర్ మండలంలోని గోరుగల్ హెలీ ప్యాడ్ వద్ద మంత్రి కేటీఆర్ కు పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్‌గా చురుగ్గా పనిచేస్తున్న అతిమముల రామకృష్ణ గుప్తను కేటీఆర్ అభినందించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యువతపై ఉందన్నారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈయన వెంట జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, బీఆర్ఎస్ జిల్లా స్థాయి నాయకులు తదితరులు ఉన్నారు.

పలుచోట్ల సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్/లింగంపేట్/రామారెడ్డి

సాలూర మండలంలోని మందర్న గ్రామంలో సర్పంచ్ రావుబా గంగాధర్ సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో రోడ్డు పనులను చేపట్టినట్టు తెలిపారు. మందర్న గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమీర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగాబాయి, మాజీ సర్పంచ్ హున్నా సొసైటీ చైర్మన్ మందర్న రవి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్, చాందు, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలో రూ.20 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ విటల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో కుమ్మరిగల్లీలో ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్టు ఉపసర్పంచ్ కౌడ రవి తెలిపారు.



బోధన్ : సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దివిటి రమేష్, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నరేష్, టౌన్ యూత్ అధ్యక్షుడు సాదిక్, సర్పంచులు రవీందర్, కిషన్, వార్డు మెంబర్లు రమేష్, సాయిలు, కాముని శ్రీనివాస్, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, పరంధాములు అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులు ప్రారంభం..

రామారెడ్డి : మండల కేంద్రంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను స్థానిక సర్పంచ్ దండ బోయిన సంజీవ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ..

ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.15 లక్షలు, ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని, స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా డైరెక్టర్ కాసర్ల రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధ రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవీందర్ గౌడ్, నాయకులు రాజేందర్ గౌడ్,బానురి నర్సారెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డబుల్ బెడ్‌రూమ్‌ల లబ్ధిదారుల ఎంపిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్‌ల లబ్ధిదారులకు డ్రా పద్ధతిన ఎంపిక చేయనున్నట్టు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. అర్హులైన వారు ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు నిర్ణయించిన నిష్పతి ప్రకారం ముత్యపు రాఘవులు పెంటయ్య ఫంక్షన్ హాల్ నందు ఉదయం 9 గంటలకు డ్రా పద్ధతిన ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. కింద తెలిపిన వార్డుల్లో ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు. 1వ వార్డు వారు ఎర్రమన్ను కుచ్చా హనుమాన్ మందిర్‌లో, 2వ వార్డు వారు పోచమ్మ గుడి బీసీ కాలనీలో, 3వ వార్డు వారు న్యూ వెంచర్ న్యూ ఆబాధి, 4 వార్డు అంగన్వాడీ సెంటర్ పోసాని పల్లి, 5వ వార్డు మున్సిపల్ కార్యాలయం గండి మాసానిపేట్, 6వ వార్డు ఐసీడీఎస్ కార్యాలయం గాంధీ నగర్, 7వ వార్డు ముదిరాజ్ సంఘం ఆదర్శనగర్, 8వ వార్డు కిరాణ వర్తక సంఘం బిందర్, 9వార్డు, 9వ వార్డు వైశ్య భవన్, 10 వార్డు అంగన్వాడీ సెంటర్ రిక్షా కాలనీ, 11వ వార్డు మహిళ సమాఖ్య భవన్ లింగారెడ్డిపేట్, 12వ వార్డు హౌసింగ్ బోర్డ్ పార్క్ వద్ద నిర్వహించనున్నారు.

ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా పోస్టల్ అసిస్టెంట్ మేనేజర్ యవన్

నవతెలంగాణ-బోధన్

పోస్టాఫీస్ ద్వారా ప్రభుత్వం నిరుపేదల సౌకర్యం కోసం కేవలం రూ.399లకే ఇన్సూరెన్స్ పాలసీ సౌకర్యం అందిస్తుందని, కావున పోస్ట్ ఆఫీస్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ అసిస్టెంట్ మేనేజర్ యవన్ అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆయన పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సౌకర్యార్థం రూ.399కే పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పథకం అందిస్తుందని, కావున ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రికరింగ్ డిపాజిట్ పథకంలో భాగంగా డబ్బులు పొదుపు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో 20వరకు 10లక్షల బీమా పాలసీలను నమోదు చేశారు. పలువురికి రైతుబంధు డబ్బులను అందించారు. దాంతో పోస్ట్ ఆఫీస్ వారు అందిస్తున్న పథకాలతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాలూర బీపీఎం ప్రసన్న లక్ష్మి, కాలనీ పెద్దలు లక్ష్మణ్, మొండూరు లింగయ్య, లక్ష్మయ్య చంటి, ఐకేపీ సీఏ పంచశీల, కాలనీవాసులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి



పిల్లలతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

నవతెలంగాణ-రెంజల్

అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారుల ఎత్తు, బరువులను కొలిచి వారికి పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి అన్నారు. బుధవారం మండలంలోని నీలా గ్రామంలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాలతో పాటు, పేపర్‌మిల్లు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలని, బాలామృతం పంపిణీ చేయాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసుకుని ఆకుకూరలు పండించాలని ఆమె టీచర్లకు ఆదేశించారు. అనంతరం పేపర్‌మిల్లు గ్రామంలోని కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరు అరెస్టు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చీమనుపల్లి, పందిమడుగు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, నాటు సారా తయారు చేస్తున్న చీమన్‌పల్లి గ్రామానికి చెందిన మాలవత్ పీరాజి, మలావత్ బాలు అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై నర్సింలు తెలిపారు. మండలంలోని చిమన్పల్లి, పందిమడుగు గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటు సారా తయారు చేస్తున్న పీరాజి బాలులను పట్టుకున్నట్లు చెప్పారు. వీరి నుండి నాలుగు లీటర్ల నాటుసార స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారుచేసిన, అమ్మిన వారి పైన కేసులు విధిస్తామని ఆయన తెలిపారు. వీరి వెంట ప్రొబిషనరీ ఎస్సై నిజామాబాద్ పి గంగాధర్ సిబ్బంది దత్త్రాత్రి, లింబాద్రి, మహేష్, భూమేశ్వరి, సలీం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
4
గురువారం 16 మార్చి 2023

సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయితీలో మహిళ సర్పంచ్ మాదరి లతా దేవరాజు, మహిళ ఉపసర్పంచ్ సుప్రియ నరసింహారెడ్డిని అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్థాయి సిబ్బంది వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి

- 24న యాత్ర ప్రారంభం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

నవతెలంగాణ-ఆర్మూర్

మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకికత్వాన్ని కాపాడటానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర జయప్రదం చేయాలని పార్టీ నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యదర్శి ఏ రమేష్ బాబు అన్నారు. పట్టణంలో శాస్త్రి నగర్‌లో పార్టీ కార్యాలయంలో బుధవారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రమేష్‌బాబు హాజరై మాట్లాడారు. బీజేపీ దేశ ప్రజలను మతోన్మాదంతో నింపుతుందని అన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేశారని లౌకిక తత్వాన్ని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని తెలిపారు. అందుకే దేశవ్యాప్తంగా బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు జన చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులోభాగంగా రాష్ట్రంలో ఈనెల 17 నుంచి జనచైతన్య యాత్ర ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి మూడు జాతాలు ప్రారంభమవుతున్నాయని, మొదటి జాత వరంగల్‌లో ఈ నెల 17న ప్రారంభమవుతుందని ఈ సమావేశానికి పార్టీ అఖిల భారత కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి హాజరవుతున్నారని చెప్పారు. రెండవ జాత ఈ నెల 23న ఆదిలాబాద్ లో ప్రారంభమవుతుందని, దీనికి పార్టీ పోలీస్ బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు హాజరవుతున్నారని, మూడవ జాత ఈ నెల 24న నిజామాబాద్‌లో ప్రారంభమవుతుందని, దీని ప్రారంభానికి పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ విజయరాఘవన్ హాజరవుతారని తెలిపారు. ఆయనతోపాటు రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు జాన్ వెస్లీ, టీ. సాగర్, చుక్కా రాములు, ఎస్. రమ, ఆర్ వెంకట్రాములు ఉంటారని అన్నారు. 24న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో బహిరంగ సభ ఉంటుందని, పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవం తం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, పల్లపు వెంకటేష్, ఏరియా కమిటీ సభ్యులు ఇడగొట్టి సాయిలు, టి భూమన్న, కుతాడి ఎల్లయ్య, జక్కం సుజాత, భామండ్ల రవి, సదమస్తుల అశోక సిద్దాల నాగరాజు, కొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఉచిత సీసీటీవీ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎస్బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఎస్బిఐ బిఎస్‌ఆర్‌ఎస్‌టిటిఐ) డిచ్ పల్లి ఆధ్వర్యంలో ఈ నెలా 18 నుండి 13 రోజుల పాటు సీసీటీవీలకు ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి గల గ్రామీణ ప్రాంత యువకులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత భోజన సదుపాయం హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని అంద చేయడం జరుగుతుందని తెలిపారు. 19 నుండి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండి నిజామాబాద్ , కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ యువకులు అర్హులని తెలిపారు. శిక్షణకు వచ్చేవారు తమ వెంట

ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్,10 వ తరగతి ధ్రువీకరణ పత్రం , ఐదు ఫోటోలు తెచ్చుకోవాలని సూచించారు. చిరునామా ఎస్బిఐ శిక్షణా కేంద్రం, ఘన్‌పూర్ రోడ్, డిచ్‌పల్లి 08461 222428, 08461 295428 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



అన్నప్రాసన చేస్తున్న టీచర్లు

మండల కేంద్రంలోని కమ్మర్‌పల్లి-2 అంగన్ వాడి కేంద్రంలో బుధవారం భీంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆరు నెలల చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ మండల పర్యవేక్షకురాలు సరస్వతి చిన్నారుల తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. అన్ని పప్పులతోని వేయించిన పప్పులు బియ్యం కలిపి గ్రైండర్ చేసి జావా లాగా ఉడికించి తినిపించాలన్నారు. చిన్నారులకు బాలామతం తినిపించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఏ వయసు పిల్లలకి ఎంత మోతాదులో ఆహారం అందించాలో వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వరలక్ష్మి, ఏఎన్ఎం కష్ణవేణి, హారిక, సాగరిక, ఆశ కార్యకర్తలు శోభ, స్వరూప, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వారు విద్యార్థుల సజనాత్మ కతను పెంపొందించుటకు, వారిలో క్రియేటివిటీని బయటకు తీయడం కోసం బుధవారం సెల్ కౌంటర్ ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు వ్యర్థ పదార్థాలను ఉపయోగించుకొని కంపోస్టు ఎరువును ఎలా తయారు చేయాలో నేర్చుకుని దానిని విక్రయించారు. కళాశాల ఆవరణలో తోటి విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను విక్రయించారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఫైనాన్షియల్ అవసరాలను వాటి యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. వీటన్నింటిని ఎంజీఎంసీఆర్ఈ లో ఉన్న విద్యార్థులు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ వారు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్కే పాండే , వైస్ ప్రిన్సిపల్ నరేందర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ హెచ్ఓడి సుభాష్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి : డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రత పాటించే విధంగా చూడాలని నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్వో తుకారం రాథోడ్ అన్నారు. బుధవారం మండలంలోని రాంపూర్ డి గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు చేపట్టాలని, విద్యార్థులు తమ ఆరోగ్యాలను తామే రక్షించుకునే విధంగా చూడాలని తెలిపారు. అనారోగ్య సమస్య వచ్చినప్పుడు వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టిక ఆహారం గురించి ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయున్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.అయన వెంట ఎం.శంకర్, ఆరోగ్య కార్యకర్తలు సుజాత, స్వర్ణలత, స్టాఫ్ నర్స్ వెన్నెల ఉన్నారు.

మున్సిపల్ డ్రైవర్‌కు న్యాయం చేయండి

- మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా
- కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికసంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మున్సిపల్ డ్రైవర్‌కు న్యాయం చేయాలని మున్సిపల్ డ్రైవర్లు అన్నారు. మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ముందుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు భూపతి మాట్లాడుతూ... మంగళవారం ఉదయం మాలపల్లిలోని ఫ్రూట్ మార్కెట్ దగ్గర, సర్కిల్ నెంబర్ 5 లో డ్రైవర్‌గా నిధులు నిర్వహిస్తున్న జస్వీర్ సింగ్‌కు ఫ్రూట్ మార్కెట్‌లోని షాపుల వ్యక్తులు చెత్త తీసుకెళ్ళమని చెప్పడంతో డ్రైవర్ ఈరోజు కొంచెం రేపు కొంచెం తీసుకెళ్తాను అని సమాధానం చెప్పారన్నారు. మొత్తం తీసుకెళ్లాలని లేకపోతే మంచిగా ఉండదని వారు హెచ్చరించారని తెలిపారు.

డ్రైవర్ మా సార్ కి చెప్పండి.. మా సార్ చెప్తేనే చెత్త తీసుకెళ్తానని డ్రైవర్ బదులు చెప్పడం తో, వాళ్లు గొడవ చేస్తూ డ్రైవర్ పై దాడి చేశారని అన్నారు. డ్రైవర్ పై చేయి చేసుకోవడం సరైనది కాదని, డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. డ్రైవర్‌ను హాస్పిటల్ కు తీసుకెళ్లి అనంతరం ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిఐటియు, ఐఎఫ్‌టీయూ జేఏసీ నాయకులు గోవర్ధన్, భూమయ్య, సుధాకర్, విట్టల్, మున్సిపల్ డ్రైవర్ యూనియన్ నాయకులు సంతోష్ గౌడ్, నవీన్, ఏక్ నాథ్, రవి కిరణ్, లక్ష్మణ్, వినోద్, నవీన్, సత్యం, శ్రావణ్ తదితర డ్రైవర్లు పాల్గొన్నారు.

'ఇంటింటికి తెలుగుదేశం పార్టీ' ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ పార్లమెంటు పరిశీలకులు దేగాం యదగౌడ్ ఆధ్వర్యంలో 'ఇంటింటికి తెలుగుదేశం పార్టీ' కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పార్టీ అబ్జర్వర్, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖరరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్టీ పునర్నిర్మాణం కోసం 'ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ' కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. ఈసందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో తెలుగుదేశానికి పూర్వపు వైభవం వస్తుందని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో జరిగిన అభివద్దే ప్రస్తుతం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఇంటికి చేరే విధంగా నాయకులు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ ముఖ్య నాయకులు మహంకాళి రాజన్న, రేంజార్ల సురేష్, వినోద్ కుమార్, జ్యోతి నారాయణ, కాశీనాథు, రాజన్న, మోహన్ దాస్, హనుమంత్ రావు, గోపిడి రాజన్న, మనుకా ప్రవీణ్, గోపాల్ రెడ్డి, శ్రీరామ్మూర్తి, ఆనంద్, అహ్మద్, కోయెడి నర్సింలు, కష్ణ రెడ్డి, భాస్కర్, సంజయ్, జావేద్, రావెల శ్రీనివాస్, శ్రీనివాస్ బాబు, లవంగ రాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అండగా నేనున్నా.. ఆందోళన వద్దు

- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన దొంతుల పెద్ద సాయిలు గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొని చికిత్సకోసం హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. చికిత్సకు లక్షా 50 యాభై వేల రూపాయల బిల్లు కావడంతో మల్లాపూర్ సర్పంచ్ లోలం సత్యనారాయణకు వివరించారు. వెంటనే ఈ విషయాన్ని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దష్టికి తీసుకెళ్లారు. దొంతుల పెద్ద సాయిలు కు నేనున్నానని ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని చెప్పి ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి లక్ష యాభై వేల రూపాయల ఎస్ ఓ సి ని అందజేసి అండగా నిలిచారని సర్పంచ్ లోలం సత్యనారాయణ తెలిపారు. బాజిరెడ్డికి రుణపడి ఉంటామని, చికిత్సకు సాయం అందజేయడానికి కషి చేసిన సర్పంచ్ సత్యనారాయణకు కతజ్ఞతలు తెలిపారు.

అంక్సాపూర్‌లో సీసీ రోడ్లకు భూమిపూజ

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్



మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 50 లక్షలు రెండో విడతగా మంజూరయ్యాయి. ఈ రోడ్లకు బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమ జమున, సర్పంచ్ ఎడ్ల రాజేశ్వర్ రెడ్డి, ఎంపిటిసి, ఉప సర్పంచ్ విక్క మధు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జేడీ నాగాదర్ రెడ్డి, ఆర్టిఏ సభ్యులు రేగుల రాములు, జిల్లా సమన్వయ సమితి సభ్యులు మిట్టపల్లి మహిపాల్, బాల్కొండ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు సామ మైపాల్, రైతు సమన్వయ సమితి గ్రామ శాఖ అధ్యక్షుడు దెగం రాములు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కిరణ్ గంగయ్య, పోరోటి గంగయ్య గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ అభివద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇంటర్ పరీక్షలు బుధవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు మండలంలోని ఆయా కళాశాలల కు చెందిన ఇంటర్ పరీక్షల అధికారులు తెలిపారు. డిచ్‌పల్లి మండలం లోని 5 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పలు కేంద్రాలను తహసిల్దార్ శ్రీనివాస్ రావు, డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మోహన్, ఎస్ఐ కచ్చాకాయల గణేష్ పలువురు అధికారులు పరిశీలించారు .ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని వారు తెలిపారు.

ధర్పల్లి :మొదటిరోజు తెలుగు, హిందీ పేపర్ 1 పరీక్షా ప్రశాంతంగా ముగిసిందని పరీక్షల నిర్వహణ అధికారి చీఫ్ సూపరిండెంట్ పి సురేష్ బాబు, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర సాహు తెలిపారు, రెండు సెంటర్లకు గాను 451 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 16 మంది గైర్హాజరైనట్లు తెలిపారు,

మోర్తాడ్:మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన మొదటి సంవత్సర పరీక్షల్లో మొదటి రోజు 21 మంది గౌరవాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. మొత్తం 315 మంది విద్యార్థులకు గాను 294 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

గురుకుల ప్రవేశ దరఖాస్తుకు నేడే ఆఖరి రోజు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వచ్చే విద్య సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి గురువారం చివరి తేదీ అని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఏ. దుర్గారెడ్డి బుధవారం ఒక ప్రకటనలొ తెలిపారు. ఆన్లైన్లో 100 రూపాయలు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 23న కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు.

మోపాల్:ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకుల పాఠశాలలో 2023-24 సంవత్సరానికి ఐదవ (5)తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష టీజి సెట్-2023 కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంజర పాఠశాల ప్రిన్సిపల్ మాధవిలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఎస్సీ ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్ష రాయటానికి అర్హులని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణంలో రెండు రెండు లక్షలు గ్రామీణ ప్రాంతాల్లో లక్షా 50 వేల రూపాయల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ttp://tswreis.ac.in వెబ్సైట్ ద్వారా ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉంటుందని తెలిపారు.

డిచ్‌పల్లి:2022-23 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి గాను టీఎస్‌డబ్ల్యూఆర్, టీటీడబ్ల్యూ ఆర్ఐ, ఎంజెపీటీబీసీడబ్ల్యూ ఆర్ పాఠశాలలో 5వ తరగతిలో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలని గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల సమన్వయకర్త బి సంగీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 16అని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోనివారు వెంటనే వారి వివరాలను https://tswreis.in సైట్‌లో అప్లై చెకోవాలని వివరించారు.

కల్వర్టుపై నుంచి పడి ఒకరు మృతి

నవతెలంగాణ-తాడ్వాయి

కల్వర్టుపై నుంచి పడి ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని కృష్ణాజివాడిలో చోటుచేసుకుంది. సుబ్బయ్య (56) మేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మంగళవారం రాత్రి ఓ కల్వర్టుపై కూర్చుని ఒక్కసారిగా కిందపడి పోయాడు. ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీరాజ్ అతిథి గృహం ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంతు షిండే బుధవారం ప్రారంభించారు. రూ.కోటి నిధులు మంజూరు కావడంతో నూతన అతిథి గృహం నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ దఫెదర్ శోభ రాజు, ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

బీటీనగర్ హైస్కూల్ విద్యార్థినికి కాంస్య పతకం

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణంలోని బీటీనగర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సుష్మశ్రీ మంగళ వారం హైదరాబాద్‌లో జరిగిన ఖోఖో పోటీలలో పాల్గొని కాంస్య పతాకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని సుష్మశ్రీకి, పీఈటీ సౌజన్యకు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం హెచ్ఎం ఆర్.వీ.ఎస్ గౌడ్ మాట్లాడుతూ.. ఖేలో ఇండియా వారు నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని పాల్గొని కాంస్య పతకం సాధించడం అభినందనీయమని అన్నారు.

ఆర్థికసాయం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని పోచారం కాలనీలో గ్రామానికి చెందిన కుర్లెం రవి (30) గుండెపోటుతో మరణించడంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బర్ల మధు, పోచారం సురేందర్‌రెడ్డి పిలుపుమేరకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం రాత్రి అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేడు పోచారం రాక

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రెండు పడక గదుల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గురువారం పాల్గొంటారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏజాస్‌ఖాన్ పేర్కొన్నారు.